క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్‌: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి అండగా ఉంటామని షాబాద్‌ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవుల మల్లేశ్‌, నవనీత దంపతుల కుటుంబసభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.20వేల నగదు అందజేశారు. పిల్లలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లల చదువులు, ఇతరత్రా ఖర్చులకు ఇబ్బందులు పడకుండా తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా స్వయంపాలన



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొందుర్గు: మండలంలోని బైరంపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రజినీకాంత్‌రెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్‌: సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్‌ రమాదేవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతులలో బ్యాక్‌లాగ్‌ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 23 వరకు ఉన్నట్లు సూచించారు. ఈ ప్రవేశ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా సూచించిన పరీక్ష కేంద్రాల్లో ఏప్రిల్‌ 21వ తేదీన ఉంటుందని తెలిపారు. పరీక్ష పూర్తి వివరాల కోసం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

శంకర్‌పల్లి గురుకుల పాఠశాలలో..

మొయినాబాద్‌: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ జయమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 వరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆలయ నిర్వాహకులతో ఎమ్మెల్యే శంకర్‌, తదితరులు

కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. బుధవారం మండలంలోని గంగన్నగూడ గ్రామంలో నాభిశిల, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా సీతారామచంద్రస్వామి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా జరిపించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ప్రజలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్‌ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, విక్రమ్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్‌, పద్మారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం.. మినీ స్టేడియం

మొయినాబాద్‌లో ప్రహరీకే పరిమితమైన క్రీడామైదానం

అభివృద్ధికి నోచుకోక అందుబాటులోకి రాని వైనం

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మొయినాబాద్‌లో ప్రహరీకే పరిమితమైన మినీస్టేడియం

మొయినాబాద్‌: మినీ స్టేడియంపై నిర్లక్ష్యం నీడలు కొనసాగుతున్నాయి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు వారు నైపుణ్యం పెంచుకోవడం కోసం పదిహేనేళ్ల క్రితం నిర్మించిన మినీస్టేడియం ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ.. గ్రామానికో క్రీడా మైదానం ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పదిహేనేళ్లుగా ప్రహరీకే పరిమితమై.. అభివృద్ధికి నోచుకోక.. క్రీడాకారులకు అందుబాటులోకి రాకుండా పోయింది. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధిపై ప్రసంగాలు చేసే అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ఈ మినీ స్టేడియాన్ని పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్‌ ప్రభుత్వమైనా మినీస్టేడియంను పట్టించుకుంటుందా అని క్రీడాకారులు వాపోతున్నారు. మొయినాబాద్‌ మండల కేంద్రం సమీపంలో మినీస్టేడియం ఏర్పాటు కోసం 2009లో అప్పటి ప్రభుత్వం పెద్దమంగళారం రెవెన్యూలోని సర్వే నంబర్‌ 356, 359లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. మినీస్టేడియం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.40లక్షల నిధులు సైతం అప్పట్లోనే మంజూరు చేసింది. ఆ నిధులతో చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ప్రహరీ నిర్మాణానికి మాత్రమే సరిపోవడంతో అక్కడితో పనులు నిలిపేశారు.

అన్ని వసతులు సమకూర్చకపోవడంతో..

మొయినాబాద్‌లో నిర్మించిన మినీస్టేడియం పద్నాలుగేళ్లుగా వినియోగంలోకి రాలేదు. ప్రహరీ మాత్రమే నిర్మించి వదిలేయడంతో మైదానం క్రీడలకు అనుకూలంగా లేదు. అక్కడక్కడ గుంతలు ఉండటంతో వాటిని చదును చేయకుండా వదిలేశారు. క్రీడాకారులకు భవనం, చూసేవారి కోసం పెవిలియన్‌ వంటివి నిర్మించలేదు. దీంతో అక్కడ క్రీడాకారులు ఎవరూ వెళ్లి ఆడే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రూ.లక్షలు వెచ్చించిన మినీ స్టేడియం అన్ని సదుపాయాలు కల్పించకపోవడంతో వినియోగంలోకి రాలేదు. ఇటీవల మినీస్టేడియంకు ఏర్పాటు చేసిన గేట్లను సైతం గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు.

ప్రైవేట్‌ మైదానాలకు వెళ్తున్న క్రీడాకారులు..

మొయినాబాద్‌లో మినీస్టేడియం అందుబాటులోకి రాకపోవడంతో చాలా మంది క్రీడాకారులు ప్రైవేట్‌ మైదానాలకు వెళ్తున్నారు. మండల పరిధిలో ప్రైవేట్‌ క్రీడా మైదానాలు విపరీతంగా పెరిగాయి. వాటిలో ఆడేందుకు క్రీడాకారులు రూ.5 నుంచి 10 వేలు చెల్లిస్తున్నారు. డబ్బులు కట్టలేని పరిస్థితిలో ఉన్న పేద కుటుంబాలకు చెందిన క్రీడాకారులు తమ క్రీడలను కొనసాగించలేక పోతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చాలా మందిలో మినీ స్టేడియం అభివృద్ధిపై కొత్త ఆశలు పుట్టుకొస్తున్నాయి.

అందుబాటులోకి తేవాలి



మొయినాబాద్‌లో లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన మినీస్టేడియం ప్రహరీకే పరిమితమైంది. క్రీడాకారులకు అందుబాటులోకి రాకపోవడంతో చాలా మంది ప్రైవేట్‌ గ్రౌండ్‌లలో ప్రాక్టీస్‌ చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మినీస్టేడియాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలి.

–మోర శ్రీనివాస్‌, ఎంపీటీసీ, రెడ్డిపల్లి

అభివృద్ధి చేస్తాం



మినీస్టేడియం నిరుపయోగంగా ఉందని ఇప్పుడే తెలిసింది. జిల్లా స్పోర్ట్స్‌ అథారిటీ అధికారులకు తెలియజేస్తాం. ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లి త్వరలోనే మినీస్టేడియాన్ని అభివృద్ధి చేయించి మండలంలోని క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తాం.

–సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్‌

కాంగ్రెస్‌ పార్టీలో పలువురి చేరిక

షాద్‌నగర్‌: మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌ నేతలు బుధవారం కాంగ్రెస్‌ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. షాద్‌నగర్‌ మున్సిపల్‌ మాజీ చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ నేత అగ్గనూరు విశ్వం, బీఆర్‌ఎస్‌ నేతలు శ్రీశైలంగౌడ్‌, నడికూడ యాదగిరియాదవ్‌లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు తాండ్ర కాశీనాథ్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బాబర్‌, జమ్రుద్‌ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి కొండన్నగూడ నేతలు

మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌ నేతలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్‌, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ విజయలక్ష్మి, యశోద, రాములు, మాజీ సర్పంచ్‌ వెంకట్‌రెడ్డిలతో పాటుగా సుమారు 65 మంది కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్‌ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే, తదితరులు

బీఆర్‌ఎస్‌ ఖాళీ అవడం ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ఖాళీ అవడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. బుధవారం పట్టణంలోని వీ కన్వెన్షన్‌ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలకు నెరవేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు ఆకర్షితులై చాలా మంది వివిధ పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రాబోవు ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ విజయ ఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌ పూర్తిగా ఖాళీ కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, విశాల, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, బాబర్‌ఖాన్‌, వెంకట్‌రాంరెడ్డి, జమ్రుద్‌ఖాన్‌, కాశీనాథ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, మోహన్‌, శివశంకర్‌గౌడ్‌, భార్గవ్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీని గెలిపించుకుందాం



రంజిత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

చేవెళ్ల: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అంతా కలిసి పనిచేద్దామని చేవెళ్ల ఎంపీ డాక్టర్‌ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌ పార్టీలో చేరిన ఎంపీని మండలంలోని ఆలూరు గ్రామ కాంగ్రెస్‌ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు నగరంలోని ఎంపీ నివాసానికి వెళ్లి ఆయనను కలిసి కాంగ్రెస్‌ పార్టీలోకి వచ్చినందుకు స్వాగతం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. .కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ అనంతరాములుగౌడ్‌, ఎంపీటీసీ నరేందర్‌, నాయకులు యాదిరెడ్డి, రాజు, రఫిక్‌షరీఫ్‌, నర్సింలు, వెంకటయ్య, ఆనందం, శంకరయ్య, మహేందర్‌, యూత్‌ కాంగ్రెస్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ శ్రీనివాస్‌, రాజు, ప్రశాంత్‌, శేఖర్‌, తదితరులు ఉన్నారు.

నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

చేవెళ్ల మండల సమావేశంలో ఎంపీపీ విజయలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. చేవెళ్ల మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. వేసవి కాలంలో నీటి సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులతో కలిసి సమన్వయంగా పనిచేయాలని సూచించారు. విద్యుత్‌ అధికారులు విద్యుత్‌ సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలన్నారు. ఏదైనా పెద్ద సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది కాబట్టి ప్రజలకు ఎంపీటీసీలు అందుబాటులో ఉండాలన్నారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు నీటి వసతి కల్పించాలని సూచించారు. మండల అభివృద్ధికి అంతా కలిసి పనిచేద్దామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారులు ఆయా గ్రామాల్లో ఉన్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వైస్‌ ఎంపీపీ కర్రె శివప్రసాద్‌, ఎంపీడీఓ హిమబిందు, ఎంఈఓ అక్బర్‌, సీడీపీఓ శోభారాణి, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓబీసీల అభ్యున్నతికి కృషి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

షాద్‌నగర్‌: ఓబీసీల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి అమలు చేసిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం పట్టణంలోని ఏబీ కన్వెన్షన్‌ హాల్‌లో పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మల్చలం మురళీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరప్ప మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. దేశంలో బలమైన ఆర్థిక వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రపంచ దేశాలన్నీ భారత్‌ వైపు చూస్తున్నాయన్నారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ఓబీసీలు ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్‌ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, నాయకులు వంశీకృష్ణ, హరిభూషణ్‌, కుర్మయ్య, దొడల వెంకటేశ్‌, శ్రీశైలం, చెట్ల వెంకటేశ్‌, ప్యాట అశోక్‌, శ్రావణ్‌, నర్సింహ్మ, సుబ్రమణ్యం, విజయ్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే విజయం

కడ్తాల్‌: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ఎంపీ రాములు పేర్కొన్నారు. బుధవారం కడ్తాల్‌ మండల కేంద్రానికి వచ్చిన ఆయనకు, నాగర్‌కర్నూల్‌ లోక్‌సభ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. నాగర్‌కర్నూల్‌ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న భరత్‌ ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరయ్య, మండల అధ్యక్షుడు మాన్యనాయక్‌, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్‌, ఏలే రమేశ్‌, డాక్టర్‌ రమేశ్‌, గోపాల్‌రెడ్డి, రవిరాథోడ్‌, మహేశ్‌, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు




అమ్మవారికి పూజలు చేస్తున్న నాయకులు



బోనాల ఊరేగింపు

మొయినాబాద్‌: మండల పరిధిలోని చిన్నషాపూర్‌లో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజులుగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం భవాని మాత, పోచమ్మ అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల కోలాహలం మధ్య విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం మహిళలు బోనాల చేసి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, భీంభరత్‌, అనంతరెడ్డి, దర్శన్‌, మాణయ్య, పీఏసీఎస్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ కండిక రమేశ్‌, నాయకులు కేబుల్‌ రాజు, సత్తిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌ రాజేశ్‌గౌడ్‌, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహోత్సవాలను విజయవంతం చేయండి



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీరేందర్‌గౌడ్‌

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్‌ ఆదిలక్ష్మి అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి జరిగే తిరు కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్‌ కోరారు. బుధవారం ఆలయ ధర్మకర్తలు శేషం జగన్నాథచార్యులు, సింహాచార్యులు కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాల నుంచి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. నేటి నుంచి ప్రారంభమై 24 వరకు కొనసాగే ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ మధుమోహన్‌, కౌన్సిలర్లు విలాస్‌, యాదగిరిరెడ్డి, నాయకులు సుధాకర్‌, శివయ్య, మదన్‌మోహన్‌, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్‌

ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ శబరి

కడ్తాల్‌: పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారించొచ్చని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ శబరి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షంలో భాగంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రకరకాల చిరుధాన్యాలతో పోషకాహారం ఏ విధంగా చేకూరుతుందో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు వివరించారు. చిరుధాన్యాల్లో ప్రొటీన్స్‌, విటమిన్స్‌ కాల్షియం, ఐరన్‌ లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్ఞానేశ్వరి, భాగ్యమ్మ, యాదమ్మ, మంగ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, కిశోర బాలికలు, బాలింతలు పాల్గొన్నారు.

ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి

ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీవో అనంతరెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: రాజకీయపక్షాలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీవో అనంతరెడ్డి కోరారు. వివిధ రాజకీయ పక్షాల నేతలతో ఇబ్రహీంపట్నంలోని రెవెన్యూ డివిజన్‌ కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్‌ శాతం పెంచేందుకు అన్ని రాజకీయ పక్షాలు కృషి చేయాలన్నారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ 2024 విడుదలైందని తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహనాలకు అనుమతులు తప్పకుండా తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, బీజే పీ, సీపీఎం, టీడీపీ ప్రతినిధులు సాయితేజ, నిట్టు జగదీశ్‌, బోసుపల్లి ప్రతాప్‌, శేఖర్‌, పురుషోత్తం, సామేల్‌, జలమోని రవీందర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల షెడ్యూల్‌ ప్రతులను పలువురు నేతలకు అందజేశారు.

వాహనాల తనిఖీ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ, మండల పరిధిలోని సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీవో అనంతరెడ్డి బుధవారం తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్‌–నాగార్జునసాగర్‌ ప్రధాన రహదారిపై గల ఆగాపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌ పోస్టును పరిశీలించి, వాహనాల తనిఖీ చేశారు. ఎస్‌ఎస్‌టీ టీం, పోలీస్‌ సిబ్బందితో కలిసి ఆయన తనిఖీలు చేపట్టారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు లభిస్తే సీజ్‌ చేస్తామని ఆయన హెచ్చరించారు.